హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.165	260	290
సూర్యాపేట	రూ.170	230	260
నల్లగొండ	రూ.152	220	250

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5 । కనిష్ఠం 25.4

మహా ప్రసాదం

» యాదగిరీశుడి ప్రసాదానికి డిమాండ్ » పెరిగిన స్వామివారి ప్రసాదాల విక్రయాలు



కొండపైన ప్రసాదాల కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఆలయ ఈవో

యాదాద్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహిమాన్విత స్వయంభూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తులు రోజురోజుకూ పెరుగుతున్నారు. రోజువారీగా స్వామివారిని దర్శించుకునే భక్తులు సంఖ్య సాధారణ రోజుల్లో 30వేలు, సెలవు రోజుల్లో 65వేల మందికి పైగా దర్శించుకుంటున్నారు. దీంతో లడ్డూ, పులిహోర ప్రసాదాలు పొందేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రసాదాల టోకెన్లు, ప్రసాదాల పంపిణీ ఒకేచోట ఉండడంతో ప్రసాద విక్రయశాల కిటకిటలాడు తోంది. రద్దీ ఎక్కువగా ఉండడంతో చాలామంది భక్తులు ప్రసాదాలను కొనుగోలు చేయకుండానే వెనుతిరుగుతున్నారు. దీంతో ఆలయ అధికారులు ప్రసాదాల విక్రయాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. కొండపైన ఉన్న శివాలయం పక్కన నూతనంగా ప్రసాదాల టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దర్శనానికి విచ్చేసిన భక్తులంతా కూడా కౌంటర్ వద్దకు వెళ్లకుండా ఒక్క సభ్యుడు మాత్రమే వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. మిగతా కుటుంబసభ్యులు సేద తీరేందుకు షెడ్ల ఏర్పాటు చేశారు. దీంతో ప్రసాదాల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతంగా తగ్గి ప్రసాదాల విక్రయాలు గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. ఆలయ అధికారులు తీసుకున్న నిర్ణయంతో ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో రూ.1,74,63,580 అధికంగా ప్రసాదాల విక్రయాలు జరిగాయి. ప్రసాదాల నాణ్యతపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

ప్రసాదాల టోకెన్ల బాధ్యత సెంట్రల్‌బ్యాంక్‌కు అప్పగింత

స్వామివారి ప్రసాదాల విక్రయానికి సంబంధించిన రశీదు బుక్‌లను గతంలో దేవస్థానం ఆధ్వర్యంలో ముద్రించేవారు. ప్రసాదాల కొనుగోలు రశీదుల ముద్రణ బాధ్యతలు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు అప్పగించారు. తద్వారా రశీదులు రీసైక్లింగ్ కాకుండా అడ్డుకట్ట పడిందని భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో ప్రసాదాల విక్రయాలు పెరిగాయి. శివాలయం ఎదురుగా నూతనంగా ప్రసాదాల కొనుగోలు కోసం ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఈ రశీదులను తీసుకుని ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రసాదాల టోకెన్లు, పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ఆదివారంతో ఇతర సెలవు దినాల్లోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తడంలేదు. ఏప్రిల్ నెలలో ప్రసాదాల విక్రయం ద్వారా రూ.3,05,08,630 కోట్లు రాగా, మే నెలలో రూ.4,79,72,210 ఆదాయం సమకూరింది.

భక్తుల సౌకర్యాలపై నజర్

స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో అధికారులు సౌకర్యాలపై దృష్టి సారించారు. కొండపైన వీఐపీ పార్కింగ్ స్థలంలో మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్స్ సౌకర్యం కల్పించారు. మే నెలలో స్వామివారికి రికార్డు స్థాయిలో 64,630మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. మే నెలలోనే 605బస్సుల ద్వారా 11,42,579మంది భక్తులను కొండపైకి, కిందకి ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. స్వామివారి చెంత సౌకర్యాలు మెరుగుపడటంతో కైంకర్యాలు కూడా పెరిగాయి. దీంతో ఏప్రిల్ నెలలో స్వామివారి ఆదాయం రూ.15,64,05,949లు ఉండగా, మే నెలలో రూ.18,90,63,273కు చేరింది.

ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తున్నాం



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకునేందుకు విచ్చే సే భక్తులకు మౌలిక సౌకర్యాలతోపాటు ఆధ్యాత్మిక భావాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్వామివారి ప్రసాదాలు భక్తులకు అందడంలేదన్న ఫిర్యాదులు రావడంతో...వెంటనే టోకెన్ల కోసం...ప్రసాదాల పంపిణీ కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశాం. టోకెన్ల జారీని సెంట్రల్ బ్యాంకుకు అప్పగించాం. పారదర్శకంగా విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- ఎ.భాస్కర్‌రావు, ఆలయ ఈవో, యాదగిరిగుట్ట

కల సాకారమై..అప్పుడే..

పదేళ్లు

ఎంతో మంది ఉద్యమకారులు, విద్యార్థుల ప్రాణత్యాగాల ఫలం. ఎన్నో పోరాటాల ఫలితం. ఆరు దశాబ్దాల కల సాకారమై దశాబ్దం పూర్తయిన వేళ. గుండెల నిండా ఆనందం. రాష్ట్రం ఏర్పడి అప్పుడే పదేళ్లు పూర్తయిందా? అన్న ఆలోచన నుంచి తేరుకునే లోపు మన కళ్లముందు ఉన్న సవాళ్లు. పదేళ్లలో నెరవేరిన హామీలేన్ని, ఇంకా నెరవరాల్సినవెన్ని, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న సమయం, వెచ్చిస్తున్న నిధులు ఇలా.. అన్నింటిపైనా చర్చలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి నేటి వరకు జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు తదితర అంశాలను జిల్లా ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు.

- (నల్లగొండ)

- 11వ వసంతంలోకి తెలంగాణ
- అంతంత మాత్రమే అభివృద్ధి
- ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టులు
- నూతన ప్రభుత్వంలో మారిన పథకాల తీరుతెన్నులు
- ఆరు గ్యారంటీలతో ప్రభుత్వ నూతన ఒరవడి
- ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలు ఇకనైనా నెరవేరుతాయా..?



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ల పూర్తి చేసుకుని ఆదివారంతో 11వ వసంతంలోకి అడుగిడుతోంది. దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వంతోపాటు బీఆర్ఎస్ సైతం సన్నాహాలు చేస్తోంది. అయితే ఉత్సవాలను నిర్వహిస్తున్నప్పటికీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అభివృద్ధి, నీళ్ల, నియామకాలు, ప్రాజెక్టుల వంటివి పూర్తి కాకపోవడంతో ప్రజలు నిరాశ నిస్పృహలతోనే ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించినప్పటికీ ఆచరణ సాధ్యంకాకపోవడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ప్రధానంగా దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోవడంతో ప్రజలు ఆందోళనలకు దిగిన ఘటనలూ ఉన్నాయి. రైతుబంధు, రైతుబీమా వంటివి బీఆర్ఎస్ ప్రభుత్వానికి పేరు తెచ్చిపెట్టాయి. గొర్రెల పంపిణీ పథకం మధ్యలో నిలిచిపోవడం, ఆ పథకంలో అక్రమాలు, అవినీతి చోటుచేసుకోవడంతో ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచాయి. అదేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఫైళ్లు నెలలకొద్దీ పెండింగ్‌లోనే ఉన్నాయి. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కులవృత్తులను ప్రోత్సహించేందుకు బీసీలకు రూ.లక్ష చొప్పున ప్రకటించినా, ఏ ఒక్కరికీ అందిన దాఖలాలు లేవు. దీంతో ఆ పథకం అంతా గందరగోళంగా మారింది. దళితబంధు పథకం సైతం గందరగోళంలో పడింది. దీనికితోడు దళితబంధు పథకం అమలుకు ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులే రూ.3లక్షల చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు వినిపించాయి.

కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉంది



పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుంది. తెలంగాణ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలు ఎనలేనివి.

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ముందడుగు వేయని ప్రాజెక్టులు

జిల్లాలో ప్రాజెక్టులు ముందడుగు వేయకపోవడంతో సాగునీటి వనరులపై ప్రభావం పడింది. శ్రీశైలం సొరంగమార్గం పనులపై గత ప్రభుత్వం హయాంలో నీలినీడలు కమ్ముకున్నాయి. నల్లగొండ జిల్లా పరిధిలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3లక్షల ఎకరాలకు పైగా సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంకోసం 2007లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రారంభించారు. 44 కి.మీ.లు టన్నెల్ తవ్వాల్సి ఉండగా 34కి.మీ.ల పనులు పూర్తయ్యాయి. అయితే తరచూ అవాంతరాలు ఏర్పడటంతో పనులు ఆగిపోయాయి. తాజాగా రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం శ్రీశైలం సొరంగమార్గం పనులపై దృష్టిసారించింది. జర్మనీ, అమెరికా దేశాలనుంచి బేరింగ్ మిషన్‌లు తీసుకొచ్చి పనులు చేపడతామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఎస్ఎల్‌బీసీ పరిధిలోని నక్కలగండి, డిండి ఎత్తిపోతల పథకం పనులు సైతం మందకొడిగా పనులు సాగుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి లెఫ్ట్‌బ్యాంకు కాల్వ ద్వారా 30 టీఎంసీల నీటిని వినియోగించుకోవడం కోసం ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. దీనివల్ల మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు 3.41లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరందించే పరిస్థితి ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టు కూడా ముందుకు సాగడంలేదు. ఈ ప్రాజెక్టుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందనేది అంతుపట్టని పరిస్థితి. నార్కట్‌పల్లి మండలంలో చేపట్టిన బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు మరో 10శాతం పూర్తయితే ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించే పరిస్థితి ఉంటుంది. ఇంకా కాల్వల పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల రూ.250కోట్లను మంజూరు చేసింది.



వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా ఆరు గ్యారంటీల పథకం ఒకటి. ఇందులో ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం అమలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల వరకు ఉచితంగా వైద్యంవంటి పథకాలతోపాటు గ్యాస్ సబ్సిడీని రూ.500 అందజేస్తోంది. దీంతోపాటు గృహవిద్యుత్ కోసం 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తూ జీరో బిల్లును అందిస్తుంది. ఇంకా రూ.2500వరకు మహిళల ఖాతాలోకి జమ కావాల్సిన పథకంతోపాటు, నెలకు రూ.4వేల పెన్షన్ వంటి పథకం అమల్లోకి రాలేదు. గత ప్రభుత్వం రైతుబంధును అమలుచేసి ఎన్ని ఎకరాలు ఉన్న ఎకరానికి రూ.5000 చొప్పున జమచేయగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం యాసంగికి సంబంధించి ఆలస్యంగానైనా అందరూ రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధును జమ చేసింది. ఇంకా వానాకాలానికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకానికి మార్గదర్శకాలు రూ పొందించాల్సి ఉంది. అయితే ఈ పథకం కింద ఎన్ని ఎకరాలకు రైతుభరోసా సాయం అందజేస్తారనేది వేచి చూడాల్సి ఉంది. దీంతోపాటు ఆగస్టు 15లోగా రుణమాఫీ రూ.2లక్షల వరకు చేసి తీరుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

11వ సంవత్సరంలోనైనా సంక్షేమం, అభివృద్ధి పెరిగేనా..?

ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన పదేళ్లలో అప్పటి ప్రభుత్వం అనేక పథకాలతో దేశం దృష్టిని ఆకర్షించింది. అందులో ప్రధానంగా రైతుబంధు, రైతుబీమా పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలను సైతం ఆలోచింపజేశాయి. చాలా పథకాలు అమల్లోకి తెచ్చినప్పటికీ మధ్యలోనే నిలిచిపోవడం, ఆలస్యం కావడమనేది అప్పటి ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపించింది. ఇక నూతన ప్రభుత్వం హయాంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన 11వ సంవత్సరంలోనైనా సంక్షేమ, అభివృద్ధి పరుగులు పెడుతుందా? లేదా? అనేది చూడాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పథకాలను ప్రస్తుత ప్రభుత్వం ముందుకు తీసుకపోతుందా లేదా? వాటి స్థానంలో కొత్త పథకాలను అమల్లోకి తీసుకవస్తుందా? అనేది చూడాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 30వేల ఉద్యోగాలకు సంబంధించి ఆర్డర్ కాపీలు అందజేశారు. అయితే బీఆర్ఎస్ మాత్రం తాము పరీక్షలు నిర్వహిస్తే.., కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆర్డర్ కాపీలు ఇచ్చిందని ఆరోపిస్తోంది.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ దాసరి హరిచందన



నల్లగొండ టౌన్, జూన్ 1: వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, ఉపఎన్నిక రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన 12జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఏఆర్‌వోలకు ఓట్ల లెక్కింపుపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదటి రౌండు చాలా ముఖ్యమని, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్‌ల సీల్ తీయడం, అలాగే అవసరమైన సామగ్రినంతటినీ ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. డేటా ఎంట్రీపై సైతం అధికారులు దృష్టి సారించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా దుప్పలపల్లి గోదాంలో నాలుగు హాళ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగుతుందన్నారు. ఇందుకుగాను 96 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లు ఉంటాయన్నారు. ఉదయం ఆరు గంటలకు ఓట్ల లెక్కింపు సిబ్బంది అందరూ లెక్కింపు కేంద్రానికి హాజరుకావాలని, ఉదయం ఎనిమిది గంటలకు కచ్చితంగా ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ప్రతీహాల్‌కు అదనపు కలెక్టర్, ఒక ఏఆర్‌వో ఇన్‌చార్జిగా ఉంటారని, అంతేగాక ఆర్డీవో స్థాయి అధికారులు ఇద్దరు ఉంటారని, 12 టేబుళ్లకు ఒక ఆర్డీవో చొప్పున ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కలెక్టర్ జె.శ్రీనివాస్, 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్, జూన్ 1: ఈ నెల 9న నిర్వహించే గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు నల్లగొండ జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా నుంచి 16,889 మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నట్లు వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్ల విషయమై ఇదివరకే సంబంధిత అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీచేసి అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్ధారించుకున్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా సంబంధిత కళాశాలలు, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లను నియమించామని, పరీక్ష నిర్వహించే అన్ని కేంద్రాలకు కలిపి తొమ్మిది రూట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా పరీక్షలు నిర్వహించే రోజున అన్ని పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించాలని, అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 10తర్వాత వస్తే పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. అనుమతించిన వారు తప్ప పరీక్ష కేంద్రాల్లోకి ఇతరులు ఎవరూ వెళ్లడానికి వీలులేదన్నారు. ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ఆరోజు పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను, గ్రూప్-1 పరీక్షల కోసం కేటాయించిన సిబ్బంది అందరూ సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. షూవంటివి కాకుండా చెప్పులు మాత్రమే వేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

ఉదయం 9.30 గంటల నుంచే బయోమెట్రిక్

పరీక్ష కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ ప్రారంభమవుతుందని, తప్పనిసరిగా బయోమెట్రిక్ ఇవ్వాలని పూర్ణచంద్ర అన్నారు. పరీక్ష తర్వాత తిరిగి వెళ్లే ముందు కూడా తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందన్నారు. బయోమెట్రిక్ వేయని, ఓఎంఆర్ ఆన్సర్ సీటును మూల్యాంకనం అభ్యర్థులు మెహంది వేసుకోవద్దని, తాత్కాలిక టాటూస్, అభ్యంతరకరమైన మెటీరియల్‌ను ధరించవద్దన్నారు. అభ్యర్థులు ఒకరోజు ముందుగానే వారు పరీక్షరాసే కేంద్రాన్ని సందర్శించాలని, దానివల్ల వారికి సులభంగా ఉంటుందన్నారు. హాల్‌టికెట్లపై సూచనలన్నిటినీ ప్రతి అభ్యర్థి తప్పకుండా చదువుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, ఆర్డీవో రవి, డీఎస్పీ శివ రామ్‌రెడ్డి, డీఈవో భిక్షపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జై హనుమాన్



హాలియాలో హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేశారు.

6

భారీగా పాఠ్యపుస్తకాల పట్టివేత

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, జూన్ 1: మిర్యాలగూడ పట్టణంలో కృష్ణాకాలనీలోని ఓ ఇంట్లో స్టోర్ చేసిన ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన పాఠ్యపుస్తకాలను శనివారం ఎంఈవో బాలాజీనాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. పాఠశాల యాజమాన్యం కృష్ణాకాలనీలో బైపాస్ సమీపంలో ఇంటిని అద్దెకు తీసుకుని అందులో పుస్తకాలను స్టాక్ చేశారు. విషయం తెలుసుకున్న సమాచార హక్కు చట్టం స్వచ్ఛంద నేతలు రుషికేశ్వరరాజు, చిలుముల కొండలు, కార్తీక్‌రాజు డీఈవోకు సమాచారం అందించారు. వెంటనే డీఈవో భిక్షపతి, ఎంఈవో బాలాజీనాయక్ పుస్తకాలు సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఎంఈవో కార్యాలయ సిబ్బంది నిరంజన్ ఫిర్యాదుదారుల సహకారంలో పుస్తకాలు దాచి ఉంచిన ఇంటిని గుర్తించి సీజ్ చేశారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. ఈ మేరకు ఆ పాఠశాల రీజనల్ ప్రిన్సిపాల్ సుజిత మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలతో తమ పాఠశాలకు సంబంధం లేదన్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే.. తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..


2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా.. అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ పాత్ర ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

లారీ డ్రైవర్‌ను కట్టేసి రూ.22 వేలు దోపిడీ

- *నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో అర్ధరాత్రి వేళ ఘటన*

నార్కట్‌పల్లి, జూన్ 1: లారీడ్రైవర్‌ను వైర్లతో కట్టేసి అతని నుంచి రూ.22 వేల నగదును గుర్తు తెలియని దుండగులు సినీ ఫక్కీలో దోచుకెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం శివారులో జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన జెడిగల ఎల్లేష్ అనే వ్యక్తి లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఏపీ 24 టీఏ - 9856 నెంబర్ గల లారీలో బేవరేజెస్ లోడుతో హైదాబాద్ నుంచి ఖమ్మం జిల్లా తల్లాడకు వెళ్లి అక్కడ అన్‌లోడ్ చేసిన అనంతరం కర్రలోడుతో తిరిగి హైదాబాద్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏపీలింగోటం శివారు వద్ద అర్ధరాత్రి సమయంలో మూత్ర విసర్జన కోసం లారీని ఆపుకుని కేబిన్ నుంచి కిందకు దిగాడు. ఇంతలోనే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతనిని గట్టిగా పట్టుకుని కొద్ది దూరం తీసుకెళ్లారు. కాళ్లు చేతులను వైర్లతో కట్టేసి డబ్బులు ఇవ్వమని బెదిరించారు. తన దగ్గర లేవని చెప్పడంతో లారీ ఎక్కి కేబిన్‌లో ఉన్న రూ. 22 వేల నగదును దోచుకుని డ్రైవర్ ఫోన్‌ను ధ్వంసం చేసి అగంతకులిద్దరూ పొలాల వెంబడి పరిగెత్తి పారిపోయారు. కాగా అతి కష్టం మీద కట్లు విప్పుకుని కొంత దూరం నడిచి వచ్చి ఇతరుల ఫోన్ సాయంతో 100 డయల్ చేయడంతో పోలీసులు వెళ్లి అతడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాధితుడు ఎల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు.

పశువుల దొంగల ముఠా అరెస్టు

- *రూ. 2.85లక్షల నగదు, టాటా వాహనం స్వాధీనం* ● *వివరాలు వెల్లడించిన డీఎస్పీ*



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర రాజు

నల్లగొండ టౌన్, జూన్ 1: పశువుల దొంగతనానికి పాల్పడుతున్న ఆరుగురు నిందితులను తిరుమలగిరిసాగర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.85లక్షల నగదు, టాటా ఇంట్రా వి 50 వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు నిందితుల వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతల్‌తండాకు చెందిన బానోతు మధు, గుగులోతు కృష్ణప్రసాద్, జానకీరాంనగర్‌కు చెందిన బానోతు దేవేందర్, తిరుమలగిరిసాగర్ మండలం చింతలపాలెంకు చెందిన ఎల్లంల సీతారామయ్య, అంతటి బాలయ్య వ్యవసాయంతో పాటు పశువుల వ్యాపారంలో అవగాహన ఉంది. వీరంతా వ్యసనాలకు బానిసలై పశువుల దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. వారికి తిరుమలగిరి సాగర్ మండలం కొంపెల్లి గ్రామానికి చెం దిన డ్రైవర్ యనమల్ల సిద్ధుతో పరిచయం ఏర్పడింది. దీంతో దొంగిలించిన పశువులను అతని ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం వేసవికాలంలో మేత కోసం వదిలిన పశువులను, కాపలాలేని పశువుల కొట్టాలను, ఊళ్లలో ఎవరూ పట్టించుకోని పశువులను గుర్తించి రాత్రి సమయంలో టాటా ఏసీ వాహనంలో పశులను కోదాడ, హైదరాబాద్ ప్రాంతాలకు తరలించి విక్రయించేవారు. వచ్చిన డబ్బులను అందరూ వాటాలు వేసుకొని పంచుకునేవారు. ఈ ముఠా ఇలా తిరుమలగిరి ప్రాంతానికి చెందిన నాగార్జునపేట తండా, చింతలపాలెం, తట్టకుంటా, కొంపెల్లి, సాపవత్‌తండా గ్రామాల్లో పశువుల దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆయా రైతుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు నాగార్జునసాగర్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో శనివారం ఉదయం తిరుమలగిరిసాగర్ ఎస్ఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా టాటా ఏస్ వాహనంలో వస్తున్న నిందితులు పోలీసులును చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకొని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ. 2.85లక్షల నగదు, టాటా ఇంట్రా వి50 వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన నాగార్జునసాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ నారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గురునాథం, కానిస్టేబుల్ నగేష్, నాగరాజు, హేమంత్, ప్రశాంత్, హోంగార్డు అంజి, శ్రీను, నర్సిరెడ్డి, శ్రీకాంత్‌లను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాద స్థలంలో లింగయ్య

కొండమల్లేపల్లి, జూన్ 1: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని జోగ్యతండా సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని దేశముకోనికుంట గ్రామానికి చెందిన అందుగుల లింగయ్య (48) తన స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. జోగ్యతండా సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లింగయ్య బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. సమాచారం అందుకున్న కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి మానవతాదృక్పథంతో గాయాలపాలైన లింగయ్యను తన పోలీసు వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు లింగయ్యకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

- *నిత్య ఆదాయం రూ.50.89లక్షలు* ● *40వేల మంది భక్తుల రాక* ● *ధర్మ దర్శనానికి గంటన్నర సమయం*


ఆలయంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూన్ 1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో నిత్య పూజలు శనివారం శాస్త్రోక్తంగా జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.50,89,865ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్ రావు తెలిపారు. కలెక్టర్ హనుమంతు కె. జెండగే, డీసీపీ రాజేష్ చంద్రతో కలిసి యాదగిరికొండపై ఆలయంలోని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తూర్పు రాజగోపురం ఎదురుగా ఉచిత దర్శన క్యూలైన్, ఎల్ఈడీ స్క్రీన్, భక్తులకు కావల్సిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వేడికి తట్టుకోలేక చిన్నారులు, పెద్దలు పరుగులు తీశారు. ఉత్తర దిశలో ఉన్న షెడ్డు కింద భక్తులు సేద తీరారు. 40వేలమంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా ఉచిత దర్శనానికి గంటన్నర సమయం, వీఐపీ టికెట్(రూ.150) దర్శనానికి అరగంట సమయం పట్టింది.

స్వామివారి సన్నిధిలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామివారి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవాయిద్యాల మధ్య వేద పండితుల మంత్రోచ్చరణలతో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ప్రధానాలయంలో, పాతగుట్ట ఆలయంలో జయంతి ఉత్సవంలో భాగంగా తొలుత విశ్వక్సేన ఆరాధన, వాసుదేవశుద్ధి పుణ్యాహవచనం, స్నపన ఆరాధన, ఆంజనేయస్వామికి అష్టోత్తర శతమన్యసూక్త పారాయణములచే అభిషేకం, లక్ష తమలపాకుల అర్చన నిర్వహించారు. క్షేత్రపాలకుడికి 108 కలశాలలో అభిషేకం నిర్వహించారు.

అవగాహన కల్పించాకే... డ్రెస్‌కోడ్ నిబంధన అమలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తులకు అవగాహన కల్పించాకే డ్రెస్‌కోడ్ నిబంధన అమలు చేయనున్నారు. నిత్య కైంకర్యాలు, అభిషేకం, అర్చన, సుదర్శన హోమం, కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, జోడు సేవలు తదితర పూజల్లో పాల్గొనేందుకు జూన్ 1వ తేదీనుంచి సంప్రదాయ దుస్తులు(డ్రెస్ కోడ్) ధరించాలని గత నెల 18న ఆలయ ఈవో భాస్కరరావు ప్రకటించారు. శనివారం (జూన్ 1వ తేదీ) నృసింహుడి దర్శనానికి వచ్చిన భక్తులకు డ్రెస్ కోడ్ ప్రాధాన్యాన్ని వివరించి సంప్రదాయ దుస్తులతో రాకున్నా ఆలయంలోనికి అనుమతించారు. డ్రెస్‌కోడ్‌పై మరింత ప్రచారం చేయాలని ఆలయ అధికారులు కార్యాచరణ రూపొందించి ఈ మేరకు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పురుషులు ధోతి, తెల్లటి లుంగీ, షర్ట్, మహిళలు చీర, చుడీదార్ వంటి సంప్రదాయ దుస్తులు ధరించాలని ఆలయ ఆవరణలో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే ఆలయంలో ప్లాస్టిక్ నిషేధం అమలుచేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. ఈ రెండు అంశాలపైనా మరో 15రోజుల సమయం పెంచి భక్తులకు అవగాహన కల్పించి అమలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్లాస్టిక్ నిషేధం అమలుపై ఆదివారం యాదగిరికొండపైన ర్యాలీ నిర్వహించనున్నారు.

రెండు నెలల్లో రూ.34కోట్ల ఆదాయం

ఆలయ ఖజానాకు భక్తుల నుంచి రెండు నెలల్లో రూ.34కోట్ల ఆదాయం సమ కూరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన రెండు నెలలకు రూ. 34,24,45,759 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు శనివారం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ రూ. 15,64,05,949, మే నెలలో రూ. 18,60,39,810 ఆదాయం సమ కూరినట్లు ఈవో ప్రకటించారు.

	ఏప్రిల్	మే
ప్రసాద విక్రయం	3,05,08,630	4,79,72,210
ఇతరములు	6,78,60,214	4,37,03,009
హుండీ	2,33,53,382	3,93,88,092
వీఐపీ దర్శనం	96,50,650	2,22,90,000
ఆర్జిత సేవలు	1,13,47,855	1,40,39,734
బ్రేక్ దర్శనం	69,10,200	95,76,000
వ్రతమండపం	43,37,300	47,18,200
విచారణ శాఖ	24,37,718	43,52,562
	15,64,05,949	18,60,39,810




కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు, భక్తులు


ప్రసాద విక్రయశాల వద్ద, స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు.

కన్నులపండువగా హనుమాన్ జయంతి


మిర్యాలగూడలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ దంపతులు


నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు


గుడిపల్లిలో స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్థులు


చిట్యాలలో స్వామివారి శోభాయాత్ర


తులసీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ




నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో ఆంజనేయస్వామికి వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నల్లగొండ జిల్లాలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అర్చకస్వాములు హనుమాన్ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచే పంచామృతాలతో అభిషేకాలు, ఆకు పూజలు, నవరసాలతో క్షీరాభిషేకం పాలాభిషేకాలు నిర్వహించారు. కొన్ని ఆలయాల్లో హనుమాన్ యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్తులు ఆలయాలకు చేరుకుని హనుమాన్ స్వామిని భక్తిశ్రద్ధలతో పూజించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా భక్తజన యువకులు ర్యాలీ నిర్వహించి ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం హాలియా పురవీధుల్లో సంగీతం, డప్పు వాయిద్యాల నడుమ కొలాటాలతో అంగరంగవైభవంగా హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. పలుచోట్ల స్వామివారికి సుప్రభాత సేవతో పాటు సింధూర అలంకరణ, వడమాల, ఆకు పూజలు అభిషేకాలను భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హనుమాత్ గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నల్లగొండ పట్టణంలోని పలు దేవాలయాల్లో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వీటీ కాలనీలో గల పంచముఖ హనుమాన్ దేవాలయం, షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, పాతబస్తీలోని హనుమాన్ దేవాలయం, తులసీనగర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంతో పాటు పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ భక్తులు చాలీసా పారాయణంతో గడిపారు. పంచాముఖ హనుమాన్ దేవాలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో స్వామి వారిని ఆశీనులను చేసి ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణంలోని రామాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. చిట్యాల మండలంలోని వెలిమినేడు శివారులో జాతీయ రహదారి పక్కన గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో పురోహితులు గర్భగుడిలోని స్వామివారికి లక్షమల్లిక పుష్పార్చనతో పాటుగా అభిషేకాలు నిర్వహించారు.

సామాన్యులను స్పృశించే విధంగా శ్రీనివాసులు కథలు

● ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్


కథల పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్

నల్లగొండ రూరల్, జూన్ 1: తెలంగాణ తొలితరం సాహితీ వేత్త ధరణికోట శ్రీనివాసులు కథలు సామాన్యులను స్పృశించే విధంగా ఉన్నాయని ఆంధ్రజ్యోతి సంపాదకుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం డాక్టర్ సంఘిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధరణికోట శ్రీనివాసులు కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీనివాసు లు కథలు మధ్య, పేద తరగతి వర్గాల కష్టాలను స్పృశించాయని, హాస్య రసం ప్రధానంగా ఉన్నా, అంతర్లీనంగా అనేక సామాజిక అంశాలను పాఠకులు ముందు ఉంచారని అన్నారు. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఇలాంటి మరుగున పడిన రచయితల, కథకుల రచనలన్నీ వెలికితీసి ముందు తరాల వారికి అందజేయాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎంవీ గోనారెడ్డి, ఎలికట్టె శంకర్‌రావు, డాక్టర్ సుంకిరెడ్డి నారయణరెడ్డి, ధరణికోట శ్రీనివాసులు మనువడు మహేంద్రకుమార్, కూతురు సీతాకుమారి, కుమారుడు సంపత్‌కుమార్, కుటుంబ సభ్యులు, బంధువులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

కార్మికశాఖ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

నల్లగొండ రూరల్, జూన్ 1: ప్రభుత్వం కార్మికశాఖను సమీక్షించి ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖలో ఖాళీల కారణంగా కార్మికులకు అందాల్సిన సౌకర్యాలు అందడంలేదని అన్నారు. గతంలో మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భవన నిర్మాణ కార్మికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు సరివోజు సైదాచారి, దాసోజు ప్రభు చారి, సురేష్, అంజనేయులు, వెంకటాచారి, మదనాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి

మాడ్గులపల్లి, జూన్ 1: గ్రామీణ ప్రజల కోసం సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, ఆర్ఎంపీలపై దాడులు ఆపాలని ఆర్ఎంపీ అసోసియేషన్ మీడియా సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ రసూల్ అన్నారు. దాడులు ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పేదలందరికీ న్యాయం చేసేందుకు కృషి : వీరేశం


గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వీరేశం


నకిరేకల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్ఆర్, సామేల్, రక్తదాన శిబిరంలో పాల్గొన్న వీరేశం




నార్కట్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్, మునుగోడు, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, మునుగోడు, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, గట్టుప్పల్ నల్లగొండ టౌన్, మర్రిగూడ, కట్టంగూరు, చిట్యాల, జూన్ 1: జిల్లాలోని మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేక్ తో పాటు స్వీట్లు పంపిణీ చేశారు.

● నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డిని ఎమ్మెల్యే వీరేశం మర్యాదపూర్వకంగా కలిశారు. నకిరేకల్‌లో జరిగిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్ వీరేశానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ తనను ఆశీర్వదించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. నిత్యం నేను ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకుడిగా పనిచేస్తానని అన్నారు. రాజకీయాల్లో పేద ప్రజలకు న్యాయం చేయడం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్, ధైద రవీందర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, చిట్యాల మునిసిపల్ కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి, నకిరేకల్, కేతేపల్లి ఎంపీపీలు బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, పెరుమాళ్ల శేఖ ర్, పీఏసీఎస్ చైర్మన్లు బోళ్ల వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, పన్నాల రాఘవరెడ్డి, కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరు నేతల కేక్‌లను కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, పుల్లెంల అచ్చాలు, జెరిపోతుల భరత్, నల్ల వెంకన్న, సట్టు సత్తయ్య, అయితరాజు యాదయ్య, విష్ణు, కొండయ్య, మేకల వెంకన్న, సత్తి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నేతకాని కృష్ణయ్య, రేగెట్టె నర్సిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేష్, దొడ్డి యాదయ్య, ఆమనగంటి జలంధర్‌రెడ్డి, బాలెం జంగులు, గౌరీదేవీ శంకర్, వంటెపాక శివ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పేదలకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మాదారం ఎంపీటీసీ నోముల జనార్ధన్, కొమరయ్యగౌడ్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీ నివాస్‌రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి భూడిద లింగయ్యయాదవ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సైదులు, నాయకులు తాటికొండ సైదులుయాదవ్, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

● గట్టుప్పల్‌లో నిర్వహించిన వేడుకల్లో డీసీసీ ఉపాధ్యక్షుడు దండు యాదగిరి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నామని జగనాథం, మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్, నాయకులు యాదయ్య, నగేష్ పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని ఎమ్మెల్యే వీరేశం జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాంద్ర మాజీ సర్పంచ్ దొండ సౌమ్యరమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. అనంతరం రెడ్ క్రాస్‌లో 50 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆలుదాసు మహేష్, గురుజ రాములు, పాండు, దొండ చిన్న రమేష్, బండ శ్రీకాంత్ రెడ్డి, గుండు నరసింహ, ఆల్దాస్ రాజు, మెట్టు రాములు, శ్రీకాంత్, చింటూ, శివకుమార్, మణికంఠ పాల్గొన్నారు.

● మర్రిగూడలో జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాంపల్లి మండలంలో జడ్పీటీసీ ఏవీరెడ్డి, వైస్ ఎంపీపీ పానగంటి రజితవెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని పేదలకు బట్టలు, పండ్లను అందజేశారు. నాయకులు మేకల జగన్మోహన్‌రెడ్డి, రవీందర్‌రావు, జైపాల్‌రెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

● చిట్యాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఆంజనేయులు, పరమేశం పాల్గొన్నారు.


కట్టంగూరు : వేడుకల్లో పాల్గొన్న నాయకులు






ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, వీరేశం జన్మదినోత్సవం సందర్భంగా మునుగోడు, నల్లగొండ, మర్రిగూడలో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

పెద్దవూర, మిర్యాలగూడ, దామరచర్ల, జూన్ 1: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి, పట్టణ కన్వీనర్ తిరుపతి రాంమూర్తి, దామరచర్ల సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లాలోని పెద్దవూర, మిర్యాలగూడ, దామరచర్ల మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మెడికల్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆశాలకు పరీక్ష పెట్టే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 30 సంవత్సరాలుగా గిరిజన ప్రాంతాల్లో 19 ఏళ్లు మైదాన ప్రాంతాల్లో ఆశా వర్కర్లు ప్రజలకు అనేక సేవలందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు ఆశాలకు వేతనాలను పెంచకుండా వారి సమస్యలను పరిష్కరించకుండా వారిని ఇబ్బందులకు గురిచేసే విధంగా పరీక్ష నిర్వహించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ఆశాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆశావర్కర్లకు కనీసం వేతనం 18 వేలు, ప్రతీ నెలా రెండో తేదీన పారితోషికం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెద్దవూరలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌కె.బషీర్, వెంకటమ్మ, సత్తమ్మ, నాగలక్ష్మి, మరియమ్మ, జయమ్మ, రామకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

● మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో నాయకులు రామారావు, ఆశా వర్కర్ పద్మ, కవిత, రామలక్ష్మి పాల్గొన్నారు.

● దామరచర్లలో ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీ వైద్యశాలలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, మండల కార్యదర్శి జయమ్మ, పద్మ, సావిత్రమ, కలమ్మ, గౌస్యబేగం, శ్రీదేవి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

పాఠశాల ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు

కట్టంగూరు: ప్రభుత్వ పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి అన్నారు. కట్టంగూరులోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని ముత్యాలమ్మగూడెం, దూసెల్లి, అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో మేక నాగయ్య, హెచ్ఎం అంజయ్య ఉన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

నార్కట్‌పల్లి: గ్రామాల్లో నిర్వహించే ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని లేనిచో చర్యలు తీసుకుంటామని అదనపు డీఆర్‌డీఓ నవీన్‌కుమార్ హెచ్చరించారు. నార్కట్‌పల్లిలో ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీని నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుండి ఈఏడాది మార్చి 31వ తేదీ వరకు ఉపాధిహామీ పథకం కింద జరిగిన రూ. 3కోట్ల 93లక్షల 35వేల 527 పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీవో వేణుగోపాల్, అంబుడ్స్‌మన్ గౌరీ, ఎంపీడీవో ఉమేష్, ఎంపీవో సుధాకర్, తిరుపతి, యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డిండి: డిండి క్రికెట్ క్లబ్‌కు చంద్రన్న ఫౌండేషన్ నిర్వాహకులు హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ రూ.15 వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శాలిగౌరారం: మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూక కిరణ్‌కుమార్ యాదవ్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తాను కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని కిరణ్‌కుమార్ యాదవ్ తెలిపారు.


సీఎంతో కిరణ్‌కుమార్

మర్రిగూడ: మండలంలోని వట్టిపల్లి గ్రామంలో ఉన్నటువంటి రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం కోసం కోడాల వెంకట్‌రెడ్డి రూ.52వేలను విరాళంగా అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య


రాఘవేందర్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 1: ఆర్థిక ఇబ్బందులతో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని చిలకమర్రి గ్రామ పంచాయతీలో గల సూరేపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.... సూరేపల్లి గ్రామానికి చెందిన తేలుకుంట్ల రాఘవేందర్‌రెడ్డి (38) కొండమల్లేపల్లిలో ఒక వైన్స్‌షాప్‌లో ఐదేళ్లుగా పనిచేస్తూ అత్తగారి గ్రామమైన కాల్వపల్లి గ్రామంలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన స్వంత గ్రామం సూరేపల్లిలో ఐదు ఎకరాల్లో దొండ పందిరి పెట్టాడు. సరైన దిగుబడి రాకపోవడంతో అప్పులు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. శనివారం తెల్లవారుజామున తన అత్తగారి ఇంటి నుంచి బయలుదేరి సూరేపల్లిలోని తన వ్యవసాయ బావి వద్దకు వచ్చి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు పక్కల వారు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడు రాఘవేందర్‌రెడ్డి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


నాగమణి (ఫైల్)

కనగల్, జూన్ 1: కుటుంబ కలహాలతో ఓ వివాహిత గడ్డి మందు తాగి చికిత్స పొం దుతూ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని దర్వేశిపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేలు గ్రామానికి చెందిన ఉడుగు జంగయ్య, రాములమ్మ చిన్న కుమార్తె నాగమణి (35)ని ఏడేళ్ల క్రితం కనగల్ మండలం దర్వేశిపురం గ్రామానికి చెందిన పాలకూరి మారయ్య చిన్న కుమారుడైన వెంకటేశానికి ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. వెంకటేశం, మామ మారయ్య నాగమణికి వివాహేతర సంబంధాలు అంటగడుతూ ఆమెను తరుచూ మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. ఈ క్రమంలోనే మే 29వ తేదీన ఉదయం నాగమణి ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో విస్తృత దాడులు

దేవరకొండ, జూన్ 1: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డిండి, దేవరకొండ మండలాల్లో శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్‌రెడ్డి ఆదేశాలతో డిండి మండలంలో బ్రాహ్మణపల్లి తండా, దేవులపల్లి తండాతో పాటు సారా తయారీ స్థావరాల్లో దాడులు నిర్వహించారు. సారా తయారీని ధ్వంసం చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడులు నియోజకవర్గం మొత్తం నిరంతరం కొనసాగుతాయని అన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నర్సింహులు, వీరబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.